## హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ ఆలయంలో హనుమాన్ చాలీసాపారాయణం చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 4: హనుమంతుడి నామస్మరణతోనే జీవితం ధన్యమవుతుందని ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత అన్నారు. హుస్నాబాద్‌లోని పాటిమీద హనుమాన్ ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 21రోజుల పాటు క్రమం తప్పకుండా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పట్టణంలోని పలు హనుమాన్ ఆలయాల్లో ఈ కార్యక్రమం నిత్యం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం భజనలు, హారతి నిర్వహించారు. కార్యక్రమంలో మాశెట్టి రాణి, చొల్లెటి లత, సరోజన, ఉమ, చంద్రకళతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ములుగు: డీసీసీబీ గోడపత్రికను చూపుతున్న బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, సిబ్బంది

- బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్

ములుగు, జూన్ 4 : జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కోరారు. ములుగు మండలంలోని వంటిమామిడి డీసీసీబీ బ్రాంచ్‌లో మంగళవారం 'సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం' గోడ పత్రికను సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ... పదేండ్లలోపు చిన్నారులపై చేసిన డిపాజిట్లకు తొమ్మిదేండ్లలో రెట్టింపు మొత్తాన్ని పొందవచ్చన్నారు. ఈ నెలలో నూతన ఖాతాను తెరిచిన వారికి రూ. 2లక్షల ఉచిత బీమా వర్తిస్తుందని సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నర్సింహులు, సిబ్బంది, శ్రావణి, సంధ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

**గోడపత్రిక ఆవిష్కరణ**

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 4: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంకు దుద్దెడ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ హీన అఫ్రీన్ కోరారు. మంగళవారం ''ఇంటింటికీ డీసీసీబీ, సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం ఆర్‌డీ స్కీంలో చేరండి లక్షాధికారి అవ్వండి'' అనే నినాదాలతో ఉన్న గోడపత్రికను ఖాతాదారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ డీసీసీబీ పథకం కింద ప్రతి ఒక్కరూ ఖాతా కలిగి ఉండాలన్నారు. సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం కింద పదేండ్లలోపు చిన్నారుల పేరుమీద డిపాజిట్ చేస్తే తొమ్మిదేండ్లలో డిపాజిట్ చేసిన డబ్బులు రెట్టింపు అవుతాయన్నారు. ఆర్‌డీ స్కీంలో ప్రతి నెలా రూ.600 పొదుపు చేసి లక్షాధికారి కావొచ్చన్నారు. జూన్‌లో ఖాతా తెరిసిన ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఉచితంగా బీమా కల్పిస్తుందన్నారు. బంగారం, హౌసింగ్, వెహికల్, అగ్రికల్చర్, ప్రధానమంత్రి గ్రామీణ తదితర లోన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొండపాకలో గోడపత్రికను విడదల చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో జయదేవ్ ఆర్య

- డీఆర్డీవో జయదేవ్ ఆర్య

హుస్నాబాద్‌రూరల్, జూన్ 4: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని టీటీసీ భవన్‌లో డీఆర్డీఏ ఉన్నతి ప్రాజెక్టులో భాగంగా 30 రోజుల మగ్గం వర్క్స్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉన్నతిలో భాగంగా మహిళలు స్వయం కృషితో ఎదిగేలా అనేక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆయా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికంగా ఎదిగేలా చూస్తామన్నారు. మహిళలు ఒకే ఆదాయ మార్గం కాకుండా వివిధ రకాల ఆదాయ మార్గాలు వచ్చే విధంగా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. అనంతరం పోతారం(ఎస్)లోని శ్రీశక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్‌ను ఆయన సందర్శించి స్కూల్ యూనిఫామ్‌లను త్వరగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో బాలకిషన్, సతీశ్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కరుణాకర్, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో రమాదేవి, సీసీలు శివచరణ్‌సింగ్, రవీందర్, అశోక్, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

## మళ్లీ శరవేగంగా రోడ్ల విస్తరణ పనులు



హుస్నాబాద్ పట్టణంలో జేసీబీతో సాగుతున్న విస్తరణ పనులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 4: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే హుస్నాబాద్ పట్టణం నుంచి వెళ్లే జాతీయ రహదారి పనులు వేగవంతం చేశారు. ఎల్కతుర్తి నుంచి మెదక్‌వెళ్లే జాతీయ రహదారి పనులు అన్ని ప్రాంతాల్లో నిర్వహించినప్పటికీ పట్టణంలో విస్తరణ పనులు చేపట్టలేదు. రహదారికి ఇరువైపులా ఉన్న భవనాలకు నష్టం జరగకుండా రహదారి పనులు చేపట్టాలని పలుమార్లు వ్యాపారస్తులు నాయకులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. విస్తరణ పనులు చేపడితే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు పనులను పెండింగ్‌లో పెట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు సూచించినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచే విస్తరణ పనులను నిర్వహించడంతో ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత కనీసం తమకు సమాచారం ఇవ్వకుండా విస్తరణ పనులు చేపడుతున్నారంటూ పనులు చేపట్టే వారితో పట్టణవాసులు వాగ్వాదానికి దిగుతున్నారు. తమకు సమయం ఇవ్వకుండా ఇష్టానుసారంగా పనులు చేపడితే భవనాలకు ముప్పు ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గజ్వేల్‌లో బీఆర్‌ఎస్‌దే పైచేయి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 85,432 ఓట్లు
- గజ్వేల్‌లో మొదటి స్థానంలో బీఆర్‌ఎస్, రెండో స్థానంలో కాంగ్రెస్
- బీఆర్‌ఎస్‌కు 19,893 ఓట్ల మెజార్టీ




నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ కళాశాలలో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది





మాట్లాడుతున్న కలెక్టర్ మనూచౌదరి

గజ్వేల్, జూన్ 4: మెదక్ పార్లమెంట్ ఎన్నికలో భాగంగా గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్‌ఎస్‌కే ఆధిక్యత లభించింది. గజ్వేల్ అసెంబ్లీ స్థానంలో 22 రౌండ్లలో ఫలితాలు లెక్కించారు. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది. పార్లమెంట్ ఎన్నికలో 44మంది అభ్యర్థులు పోటీలో ఉండగా అందులో గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,25,607 ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 85,432, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 65,539, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 56,811, బీఎస్పీ అభ్యర్థి బి.ఈశ్వర్‌కు 1367 ఓట్లు రాగా నోటాకు 728 మంది ఓటు వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి గజ్వేల్ అసెంబ్లీ స్థానంలో 19,893 ఓట్ల ఆధిక్యత రావడంతో ఇక్కడ మొదటి స్థానంలో నిలువగా రెండోస్థానంలో కాంగ్రెస్ నిలిచింది. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల వైపు ఓటర్లు మొగ్గు చూపించారు. అందులో గజ్వేల్ రూరల్, కొండపాక, కుకునూర్‌పల్లి, మర్కూక్, జగదేవ్‌పూర్ మండలాల్లో బీఆర్‌ఎస్‌కే ఆధిక్యత లభించింది. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికలో బీఆర్‌ఎస్‌కు ఓట్లు తక్కువ పడగా కాంగ్రెస్‌కు రెట్టింపు ఓట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ తమపట్టును అలాగే నిలుపుకుంది.కార్యకర్తలు గ్రామాల్లో కష్టపడి పనిచేయడంతో మెజార్టీ వచ్చిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. గజ్వేల్‌లో మొత్తంగా బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ అలాగే ఉంది. పార్లమెంట్ ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 19,893ఓట్ల మెజార్టీ రావడంలో పార్టీ శ్రేణులందరి కృషి ఉంది. మొత్తంగా గజ్వేల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనలతో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరంతరం కష్టపడి పనిచేశారు.

### సొంతగడ్డలో రఘునందన్‌కు చేదు అనుభవం

దుబ్బాక,జూన్ 4: మెదక్ పార్లమెంట్ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావుకు తన సొంతగడ్డ దుబ్బాకలో చేదు అనుభవం ఎదురైంది. మెదక్ పార్లమెంట్ ఎంపీగా గెలిచిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు సొంత ప్రాంతమైన దుబ్బాక నియోజకవర్గంలో మెజార్టీ రాలేదు. గత దుబ్బాక అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన రఘునందన్‌రావును దుబ్బాక ప్రజలు ఆదరించి, ఎమ్మెల్యేగా గెలిపించిన విషయం తెలిసిందే. ఉప ఎన్నికలో రఘునందన్‌రావు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనని తెలుసుకున్న దుబ్బాక ప్రజలు అసెంబ్లీ ఎన్నికలో ఓడించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలో సైతం రఘునందన్‌కు దుబ్బాక ఓటర్లు అదే చేదు అనుభవాన్ని రుచి చూపారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీజేపీకి ఆదరణ దక్కినప్పటికీ దుబ్బాకలో మాత్రం రఘునందన్‌కు మెజార్టీ రాకపోవడం గమనార్హం.

## దుబ్బాకలో బీఆర్‌ఎస్‌కే జై

దుబ్బాక,జూన్ 4: మెదక్ పార్లమెంట్ ఎన్నికలో భాగంగా దుబ్బాక ప్రజలు బీఆర్‌ఎస్‌కే జై కొట్టారు. మెదక్ పార్లమెంట్ స్థానం బీజేపీ కైవసం చేసుకున్నప్పటికీ .దుబ్బాక ఓటర్లు మాత్రం బీఆర్‌ఎస్‌కే మెజార్టీ అందించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ అందించి మరోసారి సత్తాచాటారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలతో పోల్చితే దుబ్బాక నియోజకవర్గంలోనే అత్యధికంగా బీఆర్‌ఎస్‌కు ఓట్లు రావడం విశేషం. దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 1,64,952 ఓట్లు పోలవ్వగా..ఇందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 66,714 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 50,873, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 31,641, ఇతరులకు 15,724 ఓట్లు వచ్చాయి. దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 15,841 ఓట్ల ఆధిక్యం సాధించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో దుబ్బాక నియోజకవర్గంలోనే బీఆర్‌ఎస్‌కు అత్యధిక మెజార్టీ రావడం విశేషం.



ఓట్ల లెక్కింపు వివరాలను తెలుసుకుంటున్న ఆయా పార్టీల ఏజెంట్లు



కౌంటింగ్ హాల్‌లో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

# హుస్నాబాద్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం

- ఏడు మండలాల్లో 23,128ఓట్ల మెజార్టీ
- రెండు, మూడు స్థానాల్లో బండి సంజయ్, వినోద్‌కుమార్
- తారుమారైన 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

హుస్నాబాద్, జూన్ 4: హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు గతంలో కంటే భిన్నంగా వచ్చాయి. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో మంగళవారం కరీంనగర్ లోక్‌సభ స్థానం ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మొదటి రౌండ్ నుంచి ఆధిక్యం కనబర్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం 2,47,701ఓట్లు ఉండగా మే 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో 1,91,361 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు 79,001ఓట్లు, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు 55,873 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు 41,298 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు 23,128 ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తం 22రౌండ్లలో కౌంటింగ్ జరిగింది. లోక్‌సభ స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం హుస్నాబాద్ నియోజకవర్గంలోనే కాంగ్రెస్ పార్టీకి లీడ్ రావడం విశేషం.

**2019ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు 23,741ఓట్ల మెజార్టీ**

2019లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అప్పటి బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు 23,741ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇదే ఫలితం ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి నమోదైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు 23,128ఓట్ల మెజార్టీ వచ్చింది. 2019ఎన్నికల్లో మొత్తం 2,36,756 ఓట్లు హుస్నాబాద్ అసెంబ్లీ పరిధిలో ఉన్నాయి. ఏప్రిల్ 11న జరిగిన పోలింగ్‌లో 1,68,307ఓట్లు పోలయ్యాయి. మే 23న జరిగిన కౌంటింగ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు 66,885 ఓట్లు రాగా అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 44,123 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు 43,144ఓట్లు వచ్చాయి. దీంతో హుస్నాబాద్ అసెంబ్లీ పరిధిలో వినోద్‌కుమార్ 23,741ఓట్ల మెజార్టీ సాధించారు. కానీ ఈ ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి వచ్చిన ఆధిక్యమే ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థికి రావడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థికి అనూహ్యంగా ఓట్లు పెరిగి మొదటి స్థానంలో ఉండగా బీజేపీకి గతంలో కంటే ఎక్కువ ఓట్లు పడ్డాయి. బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది.



కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తున్న అధికారులు

**సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం**

సిద్దిపేట, జూన్ 4: మెదక్ పార్లమెంట్ ఎన్నిక ఫలితాలు వచ్చాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఆధిక్యాన్ని కొనసాగించింది. సిద్దిపేట నియోజకవర్గంలో మొత్తం లక్షా 74 వేల 969 ఓట్లు పోలుకాగా ఇందులో బీఆర్‌ఎస్ పార్టీకి 65 వేల 923 ఓట్లు, బీజేపీకి 62వేల 823 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 33,174 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నందకిశోర్ తల్లాడకు 3240 ఓట్లు వచ్చాయి. మొత్తం 20 రౌండ్లు లెక్కించిన ఓట్లలో బీఆర్‌ఎస్ 12 రౌండ్లలో ఆధిక్యత కొనసాగించగా బీజేపీ ఏడు రౌండ్లలో ఆధిక్యత ప్రదర్శించింది. కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక రౌండ్‌లో (10వ) ఆధిక్యత ప్రదర్శించింది.

# మురుగు.. పరుగు

## దుర్గంధం వెదజల్లుతున్న హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్

- ఇటీవల కురిసిన వర్షానికి చెరువును తలపిస్తున్న వైనం
- సీసీ వేసేందుకు తీసిన గొయ్యిలో మురుగు నీరు చేరి భరించలేని దుర్వాసన
- రూ.2కోట్లతో జరుగుతున్న పనుల్లో తీవ్ర జాప్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు
- రవాణా శాఖ మంత్రి ఇలాఖాలో బస్టాండ్ తీరుపై విమర్శల వెల్లువ



బురద, మురుగునీటి మధ్య హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్

హుస్నాబాద్, జూన్ 4: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ దుర్గంధంతో నిండిపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి చుట్టుపక్కల డ్రైనేజీల నుంచి వచ్చిన వర్షపునీరు చేరి చెరువును తలపించిన బస్టాండ్ ఆవరణలో ఇంకా నీళ్లు అలాగే నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టరు మురుగునీటిని బయటకు పంపే ప్రయత్నం చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ ఆధునీకరణ పనుల్లో భాగంగా సీసీ వేసేందుకు సుమారు రెండు అడుగుల లోతు మట్టిని తీశారు. ఇందులో డ్రైనేజీల నుంచి వచ్చిన మురుగునీరు చేరి ఆటుపోట్లు వెల్లివిరిసే పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ చెరువును తలపించే విధంగా మారింది. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. సీసీ గొయ్యి తీసి పక్షం రోజులు గడుస్తున్నా సదరు కాంట్రాక్టరు సీసీ వేయక పోవడం వల్లే కార్గో కార్యాలయం నీటమునగడంతో పాటు నీళ్లు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది.

**ఆధునీకరణ పనుల్లో తీవ్ర జాప్యం...**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పొన్నం ప్రభాకర్ బస్టాండ్‌ను సందర్శించి ఆధునీకరణ పనుల కోసం రూ.2కోట్లు ప్రకటించారు. అదనపు ప్లాట్‌ఫాంలు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, బస్టాండ్ ఆవరణ మొత్తం సీసీ వేయాల్సి ఉంది. ఈ పనులు మొదలై నెల రోజులు దాటుతున్నా అందులో ఏమాత్రం పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీసీ కోసం తీసిన గొయ్యి తీసిన వెంటనే పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ అలాగే వదిలేయడంతో వర్షపునీటితో పాటు డ్రైనేజీల్లోని నీరు చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. రవాణాశాఖమంత్రి ఇలాఖాలోనే బస్టాండ్ పరిస్థితి ఇలా ఉంటే మిగతా చోట్ల ఎలా ఉంటుందనే చర్చ ఊపందుకుంటోంది. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రత్యేక దృష్టి సారించి బస్టాండ్ ఆధునీకరణ పనులను త్వరగా పూర్తి చేయించాలని, భవిష్యత్‌లో బస్టాండ్ ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా చర్యలు చేపట్టాలని హుస్నాబాద్ పట్టణ ప్రజలతోపాటు ప్రయాణికులు కోరుతున్నారు.

**వర్షపు నీటిలో మునిగిన కార్గో కార్యాలయం**

ఆర్టీసీ యాజమాన్యం విజయవంతంగా నిర్వహిస్తున్న కార్గో సేవల్లో భాగంగా హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాలయం ఇటీవల కురిసిన వర్షానికి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. అందులో ఎలాంటి వస్తువులు తడిసిపోయాయో, ఎన్ని అక్కరకు రాకుండా పోయాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ కార్గో కార్యాలయం వర్షపు నీళ్లతోనే నిండి ఉండటం గమనార్హం. విలువైన వస్తువులు నిల్వ చేసి వినియోగదారులకు చేర్చాల్సిన కార్యాలయానికి భద్రత లేకుండా పోవడం బాధాకరం. అంతే కాకుండా ద్విచక్రవాహన స్టాండ్ కూడా వర్షం పడితే చాలు పూర్తిగా మునిగిపోయే పరిస్థితి ఉంది. భారీ వర్షం కురిస్తే బస్టాండ్‌లోంచి వాహనాలు బయటకు తీయడం కష్టంగా మారుతోంది. ఇంతటి అసౌకర్యాల మధ్య, దుర్గంధం మధ్య, శిథిలావస్థ మధ్య కొట్టుమిట్టాడుతున్న బస్టాండ్ ఎన్నడు బాగుపడుతుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.



హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో వర్షపు నీటిలో మునిగిన కార్గో కార్యాలయం



సీసీ వేసేందుకు కాంట్రాక్టర్ తీసిన గొయ్యిలో నిలిచిన మురుగు నీరు

## ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన

గజ్వేల్, జూన్ 4: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా మంగళవారం నాలుగో రోజు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు చోటుచేసుకునే మంటలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ అధికారి సురేశ్‌కుమార్ అవగాహన కల్పించగా అమ్మాయిలకు నెలసరి సమస్యలపై డాక్టర్ పద్మజ్యోతి అవగాహన కల్పించారు. రాజగోపాల్‌పేట వద్ద వంద మందికి ఫైరింగ్‌పై ఎన్‌సీసీ అధికారి యాదగిరి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న మట్టి మాఫియా



ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

నంగునూరు, జూన్ 4 : మండలంలోని మగ్ధుంపూర్‌లోని ఊర చెరువు, అంక్షాపూర్ లోని నభిచెరువుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తవ్వుతున్నారు. ట్రాక్టర్‌లో మట్టిని ఖాళీ స్థలాలు, లే అవుట్‌లకు తరలిస్తూ ఒక్కో ట్రిప్పుకు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువుల ఆధునీకరణ కోసం ఎంతో నిధులు ఖర్చుచేసి మిషన్ కాకతీయ పేరుతో మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. విచ్చలవిడిగా జేసీబీల సహాయంతో పెద్ద పెద్ద గుంతలు తీస్తూ చెరువు అందాలు కనుమరుగయ్యేలా చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

